తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల | కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
శుక్రవారం
13 మార్చి 2026
పేజీలు : 8
Follow :

# పేదల ఇళ్ల పనుల్లో వేగం పెంచండి

## అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ఆదేశాలు



- మార్చి రెండవ వారం లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మోడల్ హౌసింగ్ కాలనీ ప్రారంభం మోడల్ హౌసింగ్ కాలనీ
- ఇండ్లను వేగవంతం చేయాలి
- రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హుజూర్ నగర్, మార్చి 12 (జనంసాక్షి):**
హుజూర్ నగర్ రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాలలో నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని ఈ నెల రెండవ వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి నల్లమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం హుజూర్ నగర్ లోని రామస్వామి గుట్ట వద్ద నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని ఆయన పరిశీలించారు. అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆదర్శ గృహ కాలనీ ప్రారంభానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించినట్లు చెప్పారు. అవసరమైతే అదనపు సమయం పనిచేసి అయినా అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్ సమీపంలోని రామస్వామి గుట్టలో 110 ఎకరాల విస్తీర్ణంలో ఈ కాలనీ నిర్మించబడిందని, ఇందులో 2,160 కుటుంబాలకు సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. 110 ఎకరాల విస్తీర్ణంలో రూ.125 కోట్ల వ్యయంతో ఈ గృహ కాలనీ నిర్మించబడింది. మొత్తం 2,160 ఆధునిక సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు నిర్మించి అంతే సంఖ్యలో కుటుంబాలకు వసతి కల్పించనున్నారు. ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, అత్యంత పేద కుటుంబాలు, గ్రామీణ కూలీలు, రైస్ మిల్ కార్మికులు, హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, సమీప గ్రామాల నివాసితుల కోసం ఉద్దేశించబడింది. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరగాలని మంత్రి దృష్టి పెట్టారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి మిగతా 2లో

---

### భద్రాచలంలో చెత్త కాల్చివేతతో
### భారీ ఎత్తున పొగ రావడంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన

# పెరుగుతున్న వాయు కాలుష్యం

**భద్రాచలం మార్చి 12 (జనంసాక్షి) :**
భద్రాచలం పట్టణంలో కోట్ల రూపాయల వ్యయంతో డంపింగ్ యార్డ్ నిర్మించినప్పటికీ పట్టణంలోని చెత్త మొత్తం డంపింగ్ యార్డ్‌కు తరలించకుండా జనావాసాలకు సమీపంలో వేయడం, అనంతరం చెత్తను కాల్చడం వల్ల వస్తున్న పొగతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోట్ల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన డంపింగ్ యార్డ్ ఉపయోగంలోకి రాకపోవడం, చెత్తను సరైన విధంగా నిర్వహించకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని కూనవరం రోడ్డులో ఉన్న సిఆర్పిఎఫ్ క్యాంపు వెనక కరకట్టపై చెత్తాచెదారం, వ్యర్థాలను పెద్ద ఎత్తున వేయడం జరుగుతుండగా, వాటిని తరచూ కాల్చడం వల్ల అక్కడి నుంచి ఎగసి వస్తున్న దట్టమైన పొగ పట్టణం మొత్తాన్ని కమ్మేస్తోందని ప్రజలు చెబుతున్నారు. ఈ పొగ గాలిలో కలిసిపోతూ భద్రాచలం పట్టణంలోకి చేరి వాయువును పూర్తిగా కాలుష్యానికి గురి చేస్తోందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలం పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించే టన్నుల కొద్దీ చెత్త వ్యర్థాలను మొత్తం సిఆర్పిఎఫ్ క్యాంపు వెనక కరకట్ట వద్ద వేయడం జరుగుతుండగా, వాటిని ప్రతిరోజు కాల్చడం వల్ల మిగతా 2లో





---




# మాడుగులపల్లి పాములపాడు రహదారి పనులకు మోక్షం!

## జనంసాక్షి కథనాలకు స్పందన

**మాడుగులపల్లి, మార్చి 12(జనంసాక్షి):**
ప్రజా సమస్యలపై పత్రికలు చేసే పోరాటం మరోసారి ఫలించింది. మాడుగులపల్లి నుండి పాములపాడు వరకు గత కొంతకాలంగా అధ్వాన్నంగా తయారైన రహదారి దుస్థితిపై జనం సాక్షి పత్రికలో వరుసగా ప్రచురితమైన కథనాలకు అధికారులు, కాంట్రాక్టర్లు ఎట్టకేలకు స్పందించారు. గురువారం ఉదయం కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో రహదారి పునరుద్ధరణ పనులను అధికారికంగా ప్రారంభించారు.

**కథనాలతో కదిలిన యంత్రాంగం**
గత కొన్నేళ్లుగా ఈ రహదారి గుంతలమయంగా మారి ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. వర్షాకాలంలో ఈ మార్గంలో ప్రయాణం ప్రాణసంకటంగా మారుతోందని స్థానికులు అనేకమార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను, అధికారుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ పత్రికలు మిగతా 2లో



# పేదల ఇళ్ల పనుల్లో వేగం పెంచండి

ఆధ్వర్యంలో అధికారుల బృందానికి ఈ బాధ్యత అప్పగించినట్లు ఆయన తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని అని మంత్రి స్పష్టం చేశారు. "మొదటి దశలో కేవలం 1,000 మంది లబ్ధిదారులను మాత్రమే ఖరారు చేస్తున్నామని, అత్యంత అర్హులైన వారికి ప్రాధాన్యం ఇచ్చి, సూక్ష్మంగా పరిశీలించి ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఈ ప్రక్రియ చేపడుతున్నట్లు, లబ్ధిదారులతో సీఎం సహపంక్తి భోజనం చేస్తారని మంత్రి చెప్పారు. ప్రారంభోత్సవానికి సన్నాహాలు కొనసాగుతున్నాయని కాలనీ పరిసర ప్రాంతాలను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లా ఎస్పీ కె నరసింహ, హౌసింగ్ పీడీ సిద్ధార్థ, అగ్రికల్చర్ పిడి నాగయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ చైర్పర్సన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, తహసిల్దార్ కవిత, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేకాట ఆడుతున్న వ్యక్తుల అరెస్ట్

## నగదు సెల్ ఫోన్లు స్వాధీనం పరారీలో ఇద్దరు

**నేరేడుచర్ల, మార్చి 12(జనంసాక్షి )**

పేకాట ఆడుతున్న పలువురు వ్యక్తులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నగదు సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామని నేరేడుచర్ల ఎస్ఐ ఏ.రవీందర్ నాయక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం నేరేడుచర్ల మండలం చింతకుంట్ల గ్రామంలో ప్రభుత్వం నిషేధించిన అందర్ బహార్ పేకాట ఆడుతున్నారని నమ్మదగిన సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి నల్లమేకల శంకర్, చిమ్మట మల్లయ్య, కత్తి భాస్కర్ రెడ్డి లను పట్టుబడి చేసి వారి వద్ద నుండి (52) పేకాలు, 22, 300 రూపాయల నగదు, (3) సెల్ ఫోన్లు, (2) మోటార్ సైకిల్ లను స్వాధీనం చేసుకున్నామని,అలాగే ఇట్టే.శంకర్, మాతంగి మహేష్ అనే ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నారని, వీరి పై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు



**నేరేడుచర్ల (జనంసాక్షి) :** రెగ్యులర్ విద్యార్థులకు ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిసాయి. ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభమైన పరీక్షలు కెమిస్ట్రీ కామర్స్ పరీక్షలు జరగడంతో ముగిశాయి. నేరేడుచర్ల పట్టణంలో స్పందన జూనియర్ కళాశాల , ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. చివరి రోజు పరీక్షల్లో స్పందన కళాశాలలో 178 మంది విద్యార్థులకు గాను 173 మంది విద్యార్థులు హాజరయ్యారు ఐదుగురు విద్యార్థులు గైరాజరయ్యారు.పరీక్ష విధులలో చీఫ్ సూపర్డెంట్ వీరన్న ,వెంకటరమణ, డిపార్ట్మెంట్ ఆఫీసర్లు నాగరాజు, రమేష్ అడిషనల్ చీఫ్ సూపర్డెంట్ ప్రవీణ్ రెడ్డి ,కళాశాల అధ్యాపకులు వెంకటరెడ్డి, నాగప్రసాద్, శ్రీధర్, సతీష్, ఆంజనేయులు శ్రీనివాస చారి ప్రభాకర్, సైదిరెడ్డి, నగేష్ లింగారెడ్డి, పాల్గొన్నారు.

## భద్రాచలంలో చెత్త కాల్చివేతతో పెరుగుతున్న వాయు కాలుష్యం

ఎగసి వస్తున్న పొగ పట్టణమంతా వ్యాపిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ముఖ్యంగా గాలి దిశ పట్టణం వైపు ఉండటంతో ఆ పొగ మొత్తం భద్రాచలం పట్టణంలోకి చేరి ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. ప్రత్యేకంగా పక్కనే ఉన్న శాంతినగర్ కాలనీ, సుభాష్ నగర్ కాలనీ మరియు కూనవరం రోడ్డులో నివసిస్తున్న ప్రజలు ఈ కాలుష్యపు పొగ వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొగ కారణంగా కళ్లకు మంటలు, గొంతు ఇబ్బందులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలర్జీలు వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఈ కాలుష్యంతో మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజలు చెబుతున్నారు. పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నిబంధనల ప్రకారం చెత్తను బహిరంగంగా కాల్చడం నిషేధిత చర్య అయినప్పటికీ ఇలాంటి చర్యలు కొనసాగడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్తను కాల్చడం వల్ల విడుదలయ్యే విషపూరిత వాయువులు వాతావరణాన్ని కాలుష్యానికి గురి చేయడమే కాకుండా ప్రజల ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం చూపే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.పట్టణంలో కొత్త పాలకమండలి వచ్చినప్పటికీ ఈ చెత్తాచెదారం కాలుష్యంపై ఎలాంటి నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణం అభివృద్ధి చెందాలి, ప్రజలు సంతోషంగా జీవించాలి అన్న ఆశతో ప్రజలు పాలకవర్గాన్ని ఎన్నుకున్నప్పటికీ ప్రస్తుతం ఈ సమస్యపై పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తాచెదారం జనావాసాల సమీపంలో వేయడం మరియు కాల్చడం పూర్తిగా నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలోని చెత్త మొత్తం డంపింగ్ యార్డ్‌కు తరలించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం మరియు పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.




## రాష్ట్రస్థాయికి నూతనకల్ విద్యార్థి ఎంపిక

**నూతనకల్ మార్చి12 ( జనంసాక్షి)**

ఐక్యరాజ్యసమితి కార్యకలాపాలపై సూర్యాపేటలో నిర్వహించిన తెలంగాణ మోడల్ యునైటెడ్ నేషన్స్ పోటీల్లో పీఎం శ్రీ ఉన్నత పాఠశాల నూతనకల్ విద్యార్థి గంట సాత్విక్ ప్రతిభ చాటారు జర్మనీ పర్యావరణ సమస్యలపై ప్రసంగించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ చేతుల మీదుగా గంట సాత్విక్ అవార్డు అందుకున్నాడు గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు నాయక్ సాత్విక్ ను అభినందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## మాడుగులపల్లి పాములపాడు రహదారి పనులకు మోక్షం!

వరుస కథనాలను ప్రచురించాయి. దీనిపై ఉన్నతాధికారులు సీరియస్ కావడంతో, తక్షణమే పనులు ప్రారంభించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు**

రోడ్డు పనులు ప్రారంభం కావడంతో మాడుగులపల్లి, పాములపాడు గ్రామస్తులు వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.పత్రికలు మా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం వల్లే నేడు పనులు మొదలయ్యాయి అని స్థానికులు పేర్కొన్నారు.

**నాణ్యత పాటించాలని డిమాండ్**

పనులు కేవలం నామమాత్రంగా కాకుండా, అత్యంత నాణ్యతతో చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి పనులను పర్యవేక్షిం చాలని, నిర్ణీత గడువులోగా రహదారిని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

# డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం

## ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ - మానవహారం

**అశ్వరావుపేట మార్చి12,(జనంసాక్షి):** అశ్వరావుపేట పట్టణంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసులు విస్తృత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ? ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులు, యువతకు మారకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై వివరించారు.ఈ కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ డీఎస్పీ బుచ్చయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ఇటీవల కాలంలో దేశవ్యాప్తంగా యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతున్నది ఆందోళనకరమని అన్నారు. ఒకసారి డ్రగ్స్ అలవాటు పడితే ఆ అలవాటును విడిచిపెట్టడం చాలా కష్టమవుతుందని, మొదట వినోదం లేదా ఒత్తిడి తగ్గించుకోవడం కోసం తీసుకునే డ్రగ్స్ తరువాత జీవితాన్ని పూర్తిగా నాశనం చేసే స్థాయికి తీసుకెళ్తాయని ఆయన హెచ్చరించారు. డ్రగ్స్‌కు బానిసైన వ్యక్తి మొదట కుటుంబ సభ్యులు, స్నేహితుల నుండి దూరమవుతాడని, తరువాత మానసికంగా, శారీరకంగా తీవ్ర నష్టాలను ఎదుర్కొంటాడని వివరించారు.డ్రగ్స్ సేవించడం వలన వ్యక్తి విచక్షణ కోల్పోయి అనాలోచిత చర్యలకు పాల్పడే ప్రమాదం ఉందని, కొన్నిసార్లు హత్యలు, ఆత్మహత్యలు వంటి తీవ్రమైన సంఘటనలకు కూడా దారి తీస్తున్నాయని డీఎస్పీ బుచ్చయ్య విద్యార్థులకు వివరించారు. అందుకే యువత ముందుగానే అప్రమత్తంగా ఉండి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా సబ్ ఇన్‌స్పెక్టర్ యయాతి రాజ్ మాట్లాడుతూ, కొంతమంది ధనికులు మరియు సినీ రంగానికి చెందిన వ్యక్తులు తమ ఒత్తిడిని తగ్గించు కోవడానికి స్వల్పంగా డ్రగ్స్ వినియోగించడం ప్రారంభించారని, అదే తరువాత మహమ్మారి లా మారి సమాజంలో వ్యాప్తి చెందుతోందని తెలిపారు. ఈ అలవాటు పట్టణాలకు మాత్రమే పరిమితం కాకుండా పల్లెలకు కూడా చేరుకుని కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా ఉండేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా జాగ్రత్తగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనించిన వెంటనే వారిని సరిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు పోలీసులకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.కార్యక్రమం అనంతరం ఈగల్ ఫోర్స్ అధికారులు, అశ్వారావుపేట పోలీసులు, ఎక్సైజ్ ,రెవెన్యూ శాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు, విద్యార్థులు కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వ్యతిరేక ప్లకార్డులు పట్టుకుని "డ్రగ్స్‌కు నో చెప్పండి", "యువతే దేశ భవిష్యత్తు", "డ్రగ్స్‌కు దూరంగా ఉండండి ? ఆరోగ్యంగా జీవించండి" వంటి నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది.ర్యాలీ అనంతరం అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ కూడలి వద్ద విద్యార్థులు,




అధికారులు కలిసి మానవహారం ఏర్పాటుచేసి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేశారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సంకల్పం వ్యక్తం చేశారు.అదేవిధంగా ఈ అవగాహన సదస్సులు మరో మూడు గ్రామాలు అనగా ఊట్లపల్లి, వినాయకపురం మరియు ఆశుపాక గ్రామపంచాయతీ పరిధిలలో కూడా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఈగల్ ఫోర్స్ డీఎస్పీ బుచ్చయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్ యయాతి రాజ్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, స్థానిక ప్రజలు, విద్యార్థులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## పి.ఏ.పల్లి,గుడిపల్లి మండలాల్లో

# అధిక ధరలకు యూరియా విక్రయం..!

- పి.ఏ.సి.ఎస్ సొసైటీలో సాధారణంగా 50 కిలోల బస్తా 266 నుండి 270 వరకు విక్రయం
- ఫర్టిలైజర్ దుకాణాల యందు ఒక్కో బస్తా 350 వరకు విక్రయిస్తున్న చోద్యం చూస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు
- తనిఖీలు చేపట్టని వ్యవసాయ శాఖ అధికారులు
- జిల్లా పరిపాలన యంత్రాంగం స్పందించాలని రైతుల డిమాండ్





**పి.ఏ.పల్లి/గుడిపల్లి,మార్చి 12(జనంసాక్షి )**

పి.ఏ.పల్లి,గుడిపల్లి మండలాలలో ఫర్టిలైజర్ దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో నిర్వాహకులు ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా మారినట్లు ఉంది వారి వ్యవహారం.ఉమ్మడి పి.ఏ.పల్లి మండలంలో యూరియాను ఫర్టిలైజర్ నిర్వాహకులు అధిక ధరలకు అమ్ముతున్నా కూడా పట్టించుకునే నాధుడే లేడని రైతులు ఆరోపిస్తున్నారు.పి.ఏ.పల్లి మండలం శ్రీ వెంకటేశ్వర ఫర్టిలైజర్ రంగారెడ్డిగూడెం స్టేజి వద్ద,గుడిపల్లి మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ ఫర్టిలైజర్ షాపుల యందు యూరియాను అధిక ధరలకు అమ్ముతున్న కూడా సర్వత్రా వ్యవసాయ శాఖ అధికారులపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల మండల వ్యవసాయ శాఖ అధికారులు ఎలాంటి తనిఖీలు చేపట్టకపోవడంతో ఫర్టిలైజర్ నిర్వాహకులు అధిక ధరలకు యూరియా, పెస్టిసైడ్స్ అమ్ముతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఫర్టిలైజర్ దుకాణాల యందు స్టాక్ వివరాల కొరకు నోటీస్ బోర్డు పెట్టాల్సి ఉన్నా కూడా పెట్టడం లేదని,ఉమ్మడి మండల వ్యాప్తంగా ఎలాంటి విద్యార్హత లేకున్నా కూడా కొంతమందికి లైసెన్సులు ఇచ్చారని, అలాంటి వారి లైసెన్సులు తొలగించి షాపులను రద్దు చేయాలని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.పి.ఏ.పల్లి ఉమ్మడి మండలంలో గతంలో ఫర్టిలైజర్ నిర్వాహకులకు అవగాహన లేకపోవడం వల్ల కొంతమంది రైతులకు కలుపు మందు అడగగా,గడ్డి మందు ఇచ్చిన సంఘటనలు కూడా ఉన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా పరిపాలన యంత్రాంగం మరియు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**- అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్న ఫర్టిలైజర్ నిర్వాహకులు,అధికారుల చర్యలు మాత్రం శూన్యం..?**

ఉమ్మడి మండలం వ్యాప్తంగా యూరియాను అధిక ధరలకు విక్రయిస్తున్న కూడా వ్యవసాయ శాఖ అధికారులు పట్టించు కోవడంలేదని బిఆర్ఎస్ ఉమ్మడి మండల పార్టీ అధ్యక్షుడు ఎల్గూరి వల్లపు రెడ్డి ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా పరిపాలన యంత్రాంగం స్పందించి యూరియాను అధిక ధరలకు అమ్మకుండా రైతులకు న్యాయం చేయాలని బిఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో ఉమ్మడి మండలం వ్యవసాయ శాఖ అధికారుల కార్యాలయాలను ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.






## అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు

# అవగాహన కార్యక్రమం

**చిలుకూరు,మార్చి 12(జనంసాక్షి):**

మండల కేంద్రములోని పీఎం శ్రీ జెడ్పిహెచ్ఎస్ లో వంటగ్యాస్ లీకేజీ, పేలుడు వంటి విషయాలపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై గురువారం అగ్నిమాపక సిబ్బంది విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్యాస్ లీక్ అయిన సమయంలో ప్రమాదాల్లో గాయపడిన వారికి ప్రథమ చికిత్స ముఖ్యంగా ఇళ్లలో వంటగదిలో గ్యాస్ లీకేజ్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు మంటలను అదుపులోకి తీసుకువచ్చే పరికరాలు ఏ సమయంలో ఎలాంటి పరికరాలు ఉపయోగించాలన్న వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజారావు, అగ్నిమాపక అధికారి డాక్టర్ బాబు, లీడింగ్ ఫైర్ ఫైటర్ ఆర్ నాగయ్య,ఎఫ్ఎఫ్టి ప్రవీణ్, ఫైర్ ఫైటర్స్ డి ప్రకాష్, బి వీరబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## నేడు సుధా బ్యాంకుకు 5స్టార్ క్వాలిటీ రేటింగ్ పురస్కారం అందజేత

**సూర్యాపేట(జనంసాక్షి):**

సుధా బ్యాంక్ అత్యుత్తమ నిర్వహణ, పనితీరు ఆధారంగా అంతర్జాతీయ హై క్వాలిటీ ఫైమ్ రేటింగ్ సంస్థ సుధా బ్యాంక్ కు5 స్టార్ రేటింగ్ పురస్కారం ప్రకటించింది.ఈ పురస్కారంను నేడు త్రివేణి గార్డెన్స్ లో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు సుధా బ్యాంక్ కు అందజేయనున్నట్లు సుధా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, ఈ గురుకులం ఫౌండర్ ఫర్ ఐఏఎస్ ట్రైనర్ ఆకెళ్ల రాఘవేంద్ర రానున్నట్లు తెలిపారు. బ్యాంక్ 52వ సర్వసభ్య సమావేశం నిర్వహించి వాటాదారుల సమక్షంలో ఈ పురస్కారాన్ని అందుకోవటం ఎంతో గర్వకారణమని అన్నారు.

## ప్రజా పాలన?ప్రగతి ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు శిక్షణ

**హాలియా, మార్చి 12 జనంసాక్షి:**

ప్రజా పాలన?ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో ప్రభుత్వ పథకాల అమలుపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమం నల్గొండలోని జెడ్పీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరే విధంగా అమలు చేయాల్సిన విధానాలపై అధికారులు ప్రజాప్రతినిధులకు వివరించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో హాలియా మున్సిపాలిటీ పాలకవర్గానికి చెందిన మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రా రెడ్డి, వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.





## కన్నుల పండుగగా శ్రీ లక్ష్మి తిరుపతమ్మ తల్లి, శ్రీ అంకమ్మ తల్లి పదహారు రోజుల పండుగ

**చింతలపాలెం(జనంసాక్షి)**

సూర్యాపేట జిల్లా,చింతలపాలెం మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి,శ్రీ అంకమ్మ తల్లి 16 రోజుల పండుగ సందర్భం గా భారీ ఎత్తున మహిళలు పాల్గొని అమ్మ వారికి బోనాలు, మొక్కుబడులు సమర్పించు కున్నారు. పండుగలో భాగంగా భక్తుల రాకతో మండల కేంద్రంలోని వీధులన్నీ భక్తి వాతావ రణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి శ్రీ అంకమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ తన్నీరు శివ,ధర్మకర్త లు తన్నీరు కొండ,భీమిశెట్టి సత్యనారాయణ ,భూక్య మోతీరామ్ నాయక్, యరగాని వెంక టేశ్వర్లు,తోడేటి కృష్ణంరాజు, బాణావత్ రమ ణ నాయక్,చిత్తలూరి లాలయ్య, కారింగుల బ్రహ్మయ్య,మామిడి గోపి మరియు గ్రామ పెద్దలు,యువకులు,అధిక సంఖ్యలో మహిళా సోదరీమణులు పాల్గొన్నారు.





## భువనగిరిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం

**భువనగిరి టౌన్, మార్చ్ 12 (జనం సాక్షి)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం భువనగిరి పురపాలక సంఘ పరిధిలోని వార్డు నెం.10, 25, 32లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. రామలింగం పాల్గొని పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.అలాగే వార్డు సభ్యులు బింగి నరేష్, బెండె స్వరూప లాల్ రాజు, బర్రె సంఘవి కరుణాకర్, పాల్వ వెంకటేష్, జంగిటి వినోద్ కుమార్, బొంతల నర్సింగ్ రావు, తుమ్మేటి పాండు, జాలిగం విగ్నేష్, సుదగాని సరిత రాజు, సరగడ రాజ్యలక్ష్మి అమర్ తదితరులు హాజరయ్యారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వార్డు ప్రజలు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవి కుమార్ మాట్లాడుతూ, భువనగిరి పురపాలక సంఘ పరిధిలోని మొత్తం 35 వార్డుల్లో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగుపరచడంతో పాటు ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.



# డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

## డీఎస్పీలు రవీందర్ రెడ్డి, పుష్పన్ కుమార్





**పినపాక, మార్చి 12 (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన డ్రగ్స్ రహిత తెలంగాణ, డ్రగ్స్ రహిత జనరేషన్, అనే బృహత్తర కార్యక్రమానికి తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని, తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ ని పూర్తిగా నిర్మూలించేందుకు అందరం కృషి చేయాలని మణుగూరు డిఎస్పీ వంగా రవీందర్ రెడ్డి, ఈగల్ ఫోర్స్ డిఎస్పీ పుష్పన్ కుమార్ లు అన్నారు. గురువారం పినపాక మండలంలోని ఏడూళ్ల బయ్యారం, పినపాక, జానంపేట, దుగినేపల్లి గ్రామాలలో ఏడూళ్ల బయ్యారం సిఐ వెంకటేశ్వరరావు ఎస్సై సురేష్ ల ఆధ్వర్యంలో ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండలంలో డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించి, విద్యార్థులు యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మణుగూరు డిఎస్పీ వంగా రవీందర్ రెడ్డి, ఈగల్ ఫోర్స్ డిఎస్పీ పుష్పన్ కుమార్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్టు వారు తెలిపారు. డ్రగ్స్ వినియోగం వలన ఆరోగ్యం, విద్య, కుటుంబ జీవితం, భవిష్యత్తు దెబ్బతింటాయని, యువత డ్రగ్స్ కు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. డ్రగ్స్ మాఫియా సిగిరెట్లు, చాక్లెట్ల రూపంలో విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకొని మత్తు పదార్థాలు అలవాటు చేసి వారిని తమ బానిసలుగా చేసుకుంటారని, వీటికి యువత విద్యార్థులు దూరంగా ఉండాలని కోరారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు వాడటం వలన మహిళలపై అఘాయిత్యాలు హత్యలు వంటి కేసులు పెరుగుతున్నాయని వీటిని నిర్మూలించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. మీ సమీప ప్రాంతాలలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన డ్రగ్స్ వినియోగిస్తున్న సమీపంలోని పోలీసులకు సమాచారం అందించాలని 1908 వంటి హెల్ప్ లైన్లకు ఫోన్ చేసి తెలపాలని కోరారు. ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈగల్ ఫోర్స్ అనే ప్రత్యేక పోలీసు విభాగాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు. ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అధిక మొత్తంలో అక్రమంగా రవాణా చేస్తున్న గంజా యిని పట్టుకోవడం జరిగిందని తెలిపారు. అక్రమంగా గంజాయి వంటి మత్తు పదార్థాలు రవాణా చేస్తే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపడమే కాకుండా వారి ఆస్తులను కూడా జప్తు చేయడం జరుగుతుందని తెలిపారు. పిల్లల భద్రత, మహిళలపై వేధింపులు, మానవ అక్రమ రవాణా, సైబర్ మోసాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల దృష్పరిణామాలపై పోస్టర్ల ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించి, మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లను అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఏడిఏ తాతారావు, మణుగూరు ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి, పినపాక తాసిల్దార్ గోంది గోపాలకృష్ణ, ఫారెస్ట్ డిఆర్ఓ వెంకటేశ్వర రావు. ఎంఈఓ నాగయ్య, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.



## బస్వాపురం రిజర్వాయర్ కాలువ పనులు

# వేగవంతం చేయాలి

## ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**భువనగిరి టౌన్, మార్చ్ 12 (జనంసాక్షి)**

రైతులకు సాగునీరు సమృద్ధిగా అందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో భాగంగా స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి గురువారం బస్వాపురం రిజర్వాయర్ నుంచి బునాదిగాని కాలువకు వెళ్లే కాలువను పరిశీలించారు.న్యూ దీప్తిగీ హోటల్ సమీపంలో కాలువ పనులను ప్రత్యక్షంగా పరిశీలించిన ఎమ్మెల్యే, ఇటీవల యుద్ధప్రాతిపదికన చేపట్టిన పనుల పురోగతిని తెలుసుకున్నారు. రిజర్వాయర్ నుంచి కాలువ ద్వారా నీటి ప్రవాహం ఎలా జరుగుతుందో పరిశీలించి, పరిసర గ్రామాలకు సాగునీరు సమానంగా చేరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల కళ్లలో ఆనందాన్ని చూడడమే తన ప్రధాన ధ్యేయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, పోత్నక్ ప్రమోద్ కుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు జాలిగం విఘ్నేష్, బింగి నరేష్, జంగిటి వినోద్, బొంతల నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## చిన్న జీయర్ స్వామి వారి ఆధ్వర్యంలో

## వెంకటేశ్వరుని కళ్యాణం

**మేళ్లచెరువు (జనం సాక్షి )**

స్థానిక మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, మేళ్లచెరువులో శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవములు నాల్గవ రోజు ఆధ్యాత్మిక మార్గమే సర్వదా రక్ష – మైహోం బ్రహ్మోత్సవాలలో చినజీయర్ ప్రవచనం.లౌకిక జీవన యానం ఎప్పుడూ పూలపాన్పు కాదని, కష్ట సుఖాల సమ్మిళితమని త్రిదండి చినజీయర్ స్వామి ఉపదేశించారు. మేళ్లచెరువు మహాసిమెంట్ పరిశ్రమలో నాలుగవ రోజు గురువారం శ్రీదేవీ భూదేవీ సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది.త్రిదండి చిన జీయర్ పర్యవేక్షణలో జరిగిన కళ్యాణ క్రతువు శాస్త్రోక్తంగా జరిగింది. అనంతరం చిన జీయర్ భక్తులకు ఆధ్యాత్మిక విశేషాలను ప్రస్తుత జీవన శైలికి అనుసంధానం చేస్తూ వివరించారు. కష్ట సుఖాలలో దైవ మార్గాన్ని వీడవద్దని వివరించారు.

మహాభారత ఇతివృత్తంలో కుంతి, ద్రౌపది, ఉత్తరల కష్టాలను వివరిస్తూ, నాడు వారికి శ్రీకృష్ణ పరమాత్ముడే అండగా నిలిచాడని చెప్పారు. ఆహారం లో షడ్రుచుల వలే, జీవితంలోనూ అన్నీ ఎదుర్కోవాలన్నారు. గుడిలో, మనసులో రెండు రూపాల్లో దేవుడు కొలువై ఉన్నాడని రెండు చోట్లా దైవాన్ని స్మరించాలని తెలిపారు.ఉగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది.

కార్యక్రమంలో, మై హోమ్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జూపల్లి రామేశ్వరావు, శ్రీకుమారి దంపతులు, మునగాల రామ్మోహన్ రావు, అరుణ దంపతులు, జూపల్లి వినోద రావు, భార్గవి దంపతులు, జూపల్లి రాము రావు, మేఘన దంపతులు, జూపల్లి శ్యామురావు, ఐశ్వర్య దంపతులు, జూపల్లి జగపతిరావు దంపతులు, ఉద్యోగులు, కాలనీవాసులు, భక్తులు, చుట్టుపక్కల గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు మరియు కార్మికులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.తదాంతరం తీర్థప్రసాదాల వినియోగం, అన్న సమారాధన జరిగింది.



## చండూరులో తాగునీటి ట్యాంకుల క్లీనింగ్

### 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక చర్యలు

చండూరు, మార్చి 12 (జనంసాక్షి)

చండూరు మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే లక్ష్యంగా మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ)లో భాగంగా పట్టణంలోని తాగునీటి ట్యాంకులను శుభ్రపరిచే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు.మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది పట్టణంలోని అన్ని వార్డుల్లో ఉన్న ట్యాంకులను క్లీన్ చేస్తున్నారు.ట్యాంకులను శుభ్రం చేయడంతో పాటు, క్రిమిసంహారక చర్యల్లో భాగంగా బ్లీచింగ్ పౌడర్ చల్లి పరిసరాలను పరిశుభ్రంగా మారుస్తున్నారు.ఈ క్లీనింగ్ ప్రక్రియ మార్చి 13, 2026 నుండి మార్చి 15, 2026 వరకు అన్ని వార్డుల్లో నిరంతరాయంగా కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.ప్రజల ఆరోగ్య దృష్ట్యా, కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులను అరికట్టేందుకు ఈ ముందస్తు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. పట్టణ ప్రజలు ఈ క్లీనింగ్ సమయంలో నీటి వినియోగం విషయంలో సహకరించాలని కోరారు.




## అక్రమ గ్యాస్ నిల్వలపై

## సివిల్ సప్లై దాడులు కేసులు నమోదు

### డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు కమర్షియల్ గా వాడొద్దు

### జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్



కొండమల్లేపల్లి, మార్చి 12 (జనంసాక్షి): పచ్చిమాసియా దేశాల యుద్ధ ప్రభావం ఎల్పిజి గ్యాస్ సర్ఫరాలపై ఎఫెక్ట్. తెలంగాణ రాష్ట్రంలో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు కమర్షియల్ అవసరాలకు వాడొద్దని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేష్ సూచించారు. అక్రమంగా నిల్వ ఉంచినా కృత్రిమ కొరత సృష్టించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. పచ్చిమాసియా యుద్ధ ప్రభావం ఎల్పిజి గ్యాస్ సర్ఫరాలపై పడుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం గురువారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని హోటల్స్, దాబాలు, రెస్టారెంట్స్, రీఫిలింగ్ కేంద్రాలలో డొమెస్టిక్ సిలిండర్స్ అక్రమంగా వినియోగిస్తున్న వారిపై సివిల్ సప్లయస్, ఎన్ఫోర్స్ మెంట్, టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి 60 డోమెస్టిక్ సిలిండర్స్ ను సీజ్ చేసి, ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. ప్రజలు అవసరానికి మించి గ్యాస్ సిలిండర్లు బుక్ చేయొద్దని అక్రమ వినియోగంపై టోల్ ఫ్రీ నెంబర్ 1967 లేదా 1800 425 00333 నంబర్లపై ఫోన్ చేయాలని కోరారు. ఈ దాడులలో పాల్గొన్న సివిల్ సప్లయ్స్ అధికారులు, డిప్యూటీ తాసిల్దార్స్ సివిల్ సప్లయ్స్ ఎస్ డీ. ముబీన్, డిటిసిఎస్ ఎండీ ముక్తార్, ఏ. దీపక్, ఆర్. సైదులు గౌడ్, జ్యోతి రెవిన్యూ ఇన్స్పెక్టర్స్, ఏ. సైదులు, కుమార్ రెడ్డి, టాస్క్ ఫోర్స్ సిబ్బంది సైదులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు షాక్

## మండల అధ్యక్షుడి ఒంటెద్దు పోకడలపై ధ్వజమెత్తుతూ

# ఏపూరి మహేందర్ రాజీనామా

### పలు గ్రామా పంచాయతీలలో కాంగ్రెస్ పార్టీకి భారీ నష్టం



**కామేపల్లి,మార్చి 12 (జనంసాక్షి):** కామేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనుసరిస్తున్న ఒంటెద్దు పోకడలకు వారి ఆగడాలకు నిరసనగా. కాంగ్రెస్ పార్టీ అన్ని పదవులకు రాజీనామా చేస్తున్నానని జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఊట్కూరు గ్రామానికి చెందిన ఏపూరి మహేందర్ కుమార్ వెల్లడించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు రాయల లక్ష్మయ్య నివాస గృహంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ప్రత్యర్థి పార్టీల దాడులకు భయపడకుండా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పాటుపడుతూ మెజార్టీ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్, ఎంపీటీసీ లను గెలిపిస్తూ వస్తున్నామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడే నాయకులు కార్యకర్తలకు మంత్రి, ఎమ్మెల్యే పర్యటనల వివరాలు,కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు ఇతర విషయాల సమాచారం తెలపకుండా నియంత వ్యవహరిస్తున్నాడని అందుకే తాను కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీలో ఉండలేక పార్టీకి రాజీనామా చేస్తున్నానని తెలిపారు.ఏపూరి రాజీనామాతో మండలంలో పలు గ్రామాల్లో బలంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రాజీనామా చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది.దీంతో కాంగ్రెస్ పార్టీకి పలు గ్రామాల్లో భారీ నష్టం సంభవించే ప్రమాదం పొంచి ఉంది. గ్రామాల్లో ప్రజలు కార్యకర్తలు అభిమానులు గుసగుసలాడుతూ ఉన్నారని కొంతమంది నాయకుల అనుకుంటా ఉంటే అవి విలేకరుల దృష్టిలో రావడంతో ఏపూరి మహేందర్ కుమార్ ని అడగగా విలేకరుల సమావేశంలో తెలిపారు.

# ఆశా కార్యకర్తలకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి

### ఆశా కార్యకర్తల సంఘం జిల్లా నాయకురాలు జయమ్మ



**తుంగతుర్తి మార్చ్12(జనం సాక్షి)** ఆశ కార్యకర్తలకు వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం జిల్లా నాయకురాలు జయమ్మ అన్నారు, గురువారం మండల పరిధిలోని వెంపటి గ్రామంలో పల్లె దవఖాన ముందు తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు 18 వేల జీతం, ఉద్యోగ భద్రత ప్రభుత్వం కల్పించాలని కోరారు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాల అయినప్పటికీ నేటి వరకు కూడా ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశాలు చాలీచాలని జీతాలతో సతమతం అవుతున్నారని అన్నారు, దీంతో కుటుంబ పరిస్థితి భారంగా మారిందన్నారు, ప్రభుత్వం 18 వేల జీతం, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం రాష్ట్రంలో ఆశలకు 40 శాతం మాత్రమే జీతాలు ఇచ్చి, మిగిలిన వారికి జీతాలు పంపిణీ చేయకపోవడం దురదృష్టకరమైన విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తల సంఘం మండల నాయకురాలు సుజాత, కమలమ్మ ,రాజేశ్వరి, లీలమ్మ, యాగలక్ష్మి శోభా, పద్మ, వెంకటమ్మ ,సరితా, సంధ్య ,కోకిల, మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలి



**సూర్యాపేట(జనంసాక్షి):** సూర్యాపేట మున్సిపాలిటీ అభివృద్ధిలో దళిత కౌన్సిలర్లు భాగస్వాములు కావాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలని నాయకులు చింతలపాటి చినశ్రీరాములు మాదిగ, వల్లపట్ల దయానంద్, గుద్దేటి ఎల్లయ్య మాదిగ, ఎర్ర వీరస్వామి మాదిగ, యాతాకుల రాజన్న మాదిగ అన్నారు.బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సంక్షేమ భవన్ లో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ సంక్షేమ భవన్ వారి ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ఎన్నికైన దళిత మున్సిపల్ కౌన్సిలర్లు పడిదల సైదులు, ఈద ప్రవీణ్, పిడమర్తి కీర్తి, సంద్రపాటి విజయకుమార్, జ్యోతి శ్రీవిద్య కరుణాకర్, పోతరాజు ఇందుశ్రీ అనిల్, వల్దాసు లక్ష్మీశ్రీనివాస్ లను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ ఆశయ సాధనకు కృషి చేస్తామని అన్నారు.తమను గెలిపించిన వార్డు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ వైద్యులు డాక్టర్ విజయ మోహన్, ఇరుగు కోటీశ్వరి, సిహెచ్ రామన్న మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వార్డులలో అర్హులకు అందేలా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు దున్న శ్యామ్, చింత జాన్ విల్సన్, బొజ్జ సైదులు మాదిగ, బరపటి ప్రభాకర్, నవిలే ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పోచంపల్లిలో విషాదం: నారాయణ రెడ్డి మృతి.. పరామర్శించిన పాండన్న

### నారాయణ రెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించిన బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్



**గుర్రంపోడు: మార్చి 12 (జనంసాక్షి):** నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం పోచంపల్లి గ్రామ నివాసి ఇంద్రకంటి నారాయణ రెడ్డి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండన్న పోచంపల్లికి చేరుకుని నారాయణ రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.సర్పంచ్ గుండెబోయిన కళావతి సత్యనారాయణ ద్వారా సమాచారం అందుకున్న పాండన్న, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుమారుడు ఇంద్రకంటి ప్రభాకర్ రెడ్డిని కలిసి ఓదార్చారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో తేలుకుంట్ల కూర్మాల్ రెడ్డి, బొంగరాల నరేష్, పూల సైదులు, వెన్న భూపాల్ రెడ్డి, దూదిపాళ్ళ నారాయణ రెడ్డి, వెన్న మాధవ రెడ్డి, గోవు సత్యనారాయణ రెడ్డి, మర్రిపెద్ది శ్రీనివాస్ రెడ్డి, నారాయణ యాదగిరి, కర్నాటి వినోద్ రెడ్డి, పున్ రెడ్డి వెంకటరెడ్డి, పున్ రెడ్డి రవీందర్ రెడ్డి, కర్నాటి మల్లారెడ్డి, కర్నాటి జాన్ రెడ్డి, పున్ రెడ్డి భార్గవ్ రెడ్డి, అలుగుబెల్లి ఆదిరెడ్డి మరియు పోచంపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

# దేశ్‌ముఖి గ్రామంలో ఎలక్ట్రిక్ బస్సు ప్రారంభించిన సర్పంచ్

**భూదాన్ పోచంపల్లి, మార్చి 12 (జనంసాక్షి):**



మండలంలోని దేశ్‌ముఖి గ్రామానికి హయత్‌నగర్ డిపో నుండి నూతనంగా ఎలక్ట్రిక్ బస్సు సౌకర్యం మంజూరు కావడంతో బుధవారం గ్రామ సర్పంచ్ దుర్గం జంగయ్య యాదవ్ బస్సు సర్వీసును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ఈ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కనమోని శంకర్, మాజీ సర్పంచ్ దుర్గం నరేష్, ఉప సర్పంచ్ నూకల అశోక్, ఈరుగు రాములు, నరేంద్ర, నార్ల రాజు, వెంకటేష్, కె. మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జనంసాక్షి దెబ్బ దాచారంలో కదిలిన యంత్రాంగం

- ○వార్త ప్రచురణతో నిద్రలేచిన అధికారులు
- ○గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు ఇంటింటి సర్వే
- ○ఫోటోలకే పరిమితమైన పర్యటనలపై వెల్లువెత్తిన నిరసనలు


వార్తలు వస్తున్నా వదలని మొద్దునిద్ర
○దాచారంలో జ్వరాల మరణమృదంగం!
○మంత్రి ఇలాకాలో అధికారుల బరితెగింపు
ఫోటోలకే పరిమితమైన పర్యటనలు!

**మాడుగులపల్లి మార్చి 12 (జనంసాక్షి ):** దాచారం గ్రామంలో విష జ్వరాల మరణాలు, అధికారుల నిర్లక్ష్యంపై జనం సాక్షి ప్రచురించిన కథనానికి జిల్లా యంత్రాంగం దిగివచ్చింది.వార్తలు వస్తున్నా వదలని మొద్దు నిద్ర అధికారుల బరితెగింపు ఫోటోలకే పరిమితమైన పర్యటనలు అంటూ పాలకుల, అధికారుల తీరును ఎండగడుతూ వెలువడిన వార్త జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కథనంతో ఉలిక్కిపడ్డ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, వెంటనే స్పందించి దాచారం గ్రామంలో యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది.

**గ్రామంలో వైద్య శిబిరం ముమ్మర తనిఖీలు**

వార్త ప్రచురితమైన వెంటనే జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఉదయాన్నే వైద్య బృందాలు దాచారం గ్రామానికి చేరుకున్నాయి. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి, జ్వర పీడితులకు పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు సర్వే చేపట్టారు. అనుమానిత లక్షణాలున్న వారికి రక్త పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. జ్వరాలు ప్రబలిన కొత్తలోనే స్పందించి ఉంటే మరణాలు సంభవించేవి కావని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు కంటితుడుపు చర్యలు కాకుండా, గ్రామంలో పూర్తిస్థాయి పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ**

వైద్య శిబిరంతో పాటు గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగించి, డ్రైనేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. నిల్వ ఉన్న నీటిపై ఫాగింగ్ నిర్వహించారు. జనం సాక్షి కథనం వల్లే అధికారులు ఇక్కడికి వచ్చారని, లేదంటే తమ పరిస్థితి దారుణంగా ఉండేదని స్థానికులు పేర్కొన్నారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తామని, ప్రజలు భయాందోళన చెందవద్దని వైద్యులు సూచించారు. ఏది ఏమైనా, ప్రజా సమస్యలపై జనం సాక్షి చూపిన చొరవకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

**పాలకుల తీరుపై ప్రజల ఆగ్రహం**

మంత్రి పర్యటనలు కేవలం ఫోటోలకే పరిమితమవు తున్నాయని, క్షేత్రస్థాయిలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా పట్టించు కోవడం లేదని గ్రామస్తులు జనం సాక్షి ప్రతినిధి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.



# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి : పోతినేని సుదర్శన్ రావు

## సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు




మధిర, మార్చి 12 (జనంసాక్షి): సిపిఎం పార్టీ జనరల్ బాడీ సమావేశం స్థానిక బోడేపుడి భవన్ నందు జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో మొక్కజొన్న పంట ఇప్పటికే చేతికి వచ్చింది. ఆరు కాలమ్స్ శ్రమించిన మొక్కజొన్న రైతు తక్కువ ధరలకే ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి ఖమ్మం జిల్లాలో అత్యధికంగా సాగు చేసిన మొక్కజొన్న పంట కొనుగోలు కోసం కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. రైతులకు అందించాల్సిన పంట సహాయన్ని కాలం గడిచిపోయినప్పటికీ అందించడంలో వైఫల్యం చెందారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం రైతు సంక్షేమం గురించి ఆలోచించకుండా రోజువారి రాజకీయాల్లో మంత్రులు ఎవరికి వారు బిజీగా ఉన్నారని అన్నారు. ప్రభుత్వం రైతాంగం పై పేద ప్రజలపై యుద్ధం ప్రకటించినట్లు కనపడు తోందని అన్నారు. యూరియా అందించడంలోనూ రుణమాఫీ చేయడం లోనూ పంట సహాయము అందించడంలోనూ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లా డుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు ఈ కార్య క్రమంలో సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు పార్టీ డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు దివెల వీరయ్య మంద సైదులు డివిజన్ నాయకులు పాపినేని రామ నరసయ్య కిలారి సురేష్ పట్టణ కార్యదర్శి పడకంటి మురళి ఎర్రుపాలెం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ ఓట్ల శంకర్రావు బంధం శ్రీనివాసరావు గౌర్రాజు ధనలక్ష్మి గుండ్లపల్లి రమణమ్మ హనుమంతరావు వెంకట్రావు మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.



# ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఎస్సై హరితకు ఘన సన్మానం

కల్లూరు మార్చి 12 (జనంసాక్షి) అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో భాగంగా ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు దోసపాటి సంధ్యారాణి ఆధ్వర్యంలో కల్లూరు మహిళ ఎస్సై దిద్దుకూరి హరితను శాలువాతో ఘనంగా సత్కరించి మెమొంటో బహుకరించారు. ఈ కార్యక్రమంలో సముద్రాలపుల్లారావు, లక్ష్మి,పద్మప్రియ ,దోసపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# మత్తుకు బానిసలయితే భవిష్యత్తు అంధకారం

## డ్రగ్స్ రహిత లక్ష్యమే నా ధ్యేయం

## మండల వ్యాప్తంగా డ్రగ్స్ రహిత అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన ఎస్సై విజయసింహారెడ్డి





అన్నపురెడ్డిపల్లి మార్చి 12 ( జనంసాక్షి ) అన్నపురెడ్డిపల్లి మండలాన్ని డ్రగ్స్ రహిత మండలంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సబ్ ఇన్‌స్పెక్టర్ విజయసింహారెడ్డి ఆధ్వర్యంలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు హైదరాబాద్ నుండి విచ్చేసిన ఈగల్ టీం ఇన్‌స్పెక్టర్ ఏ. పూర్ణేశ్వర్ పాల్గొని విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. మండలంలోని పలు గ్రామాలలో వరుసగా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మొదటగా పెంట్లం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కారం శివ, ఉపసర్పంచ్ మరియు ఇతర గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం రాజాపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ పోతినేని నీల, ఉపసర్పంచ్ పుచ్చకాయల సర్వారెడ్డి మరియు ఇతర గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తదుపరి అన్నపురెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహసిల్దార్ జి. ప్రతాప్ పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి ఉండేటి ఆనందకుమార్, గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మారగాని అశోక్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రవికుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు గ్రామ యువత కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహించి డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రజలకు సందేశం అందించారు. మధ్యాహ్నం ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ వేముల నరేష్, గ్రామ పెద్దలు వేముల రమణ, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు శంకర్ మహదేవన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. అలాగే యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి క్రీడల వైపు మళ్లేలా ప్రోత్సహిస్తూ మండలంలోని గ్రామాలలో స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గ్రామ యువత మరియు గ్రామ ప్రజలతో కలిసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిజ్ఞ చేయించారు. మండలంలోని ప్రతి గ్రామంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.



# పొంగులేటి పర్యటనలను జయప్రదం చేయండి

## మేకల మల్లిబాబు యాదవ్ పిలుపు

కామేపల్లి,మార్చి 12 (జనంసాక్షి): ఈనెల 13వ తేదీ శుక్రవారం నాడు కామేపల్లి మండలం లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంకు తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ రెవిన్యూ,సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి. ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య విచ్చేయుచున్న సందర్భంగా పండితాపురం పశువుల సంత నుండి పొంగులేటి శ్రీనన్న వెంట భారీ ర్యాలీ కార్యక్రమం జరుగుతుందని,పొంగులేటి అభిమానులు నాయకులు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొని జయప్రదం చేయవలసిందిగా, కామేపల్లి మాజీ జెడ్పిటిసి,డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పిలుపునిచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యంగా ఖమ్మం జిల్లా కు ఎక్కువ ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేసిన నేపథ్యంలో దాదాపు ఇప్పటికే 70% పైగా ఇండ్ల నిర్మాణం పూర్తయిందని,ఎక్కడ ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా బిల్లులు మంజూరు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి, దక్కిందని వారు అన్నారు.ప్రతి అభివృద్ధి పనులు ఏకవంతంగా నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనన్నకు, ఇల్లందు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యేకోరం కనకయ్యకు దక్కుతుందని మల్లి బాబు యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కొమనేపల్లి గ్రామ ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, వార్డు మెంబర్లు ధరావతలాలు నాయక్,ఎస్.కె రబ్బానీ పాషా మండల కాంగ్రెస్ నాయకులు గుగులోతు రవి, దేరంగుల తిరపయ్య మొగిలి శ్రీను,మేకల లక్ష్మీనారాయణ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# అక్క మృతితో దుఃఖంలోనూ పరీక్ష రాసిన చెల్లెలు



మధిర, మార్చి 12(జనంసాక్షి): అక్క మరణంతో తీవ్ర దుఃఖంలో మునిగిపోయినా, తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షకు హాజరైన ఓ విద్యార్థిని మనసును కదిలించే ఘటన మధిరలో చోటుచేసుకుంది. మధిర ప్రాంతానికి చెందిన చంద్ర హాసిని అనే విద్యార్థిని ఖమ్మం లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాస్తోంది. అయితే బుధవారం మధిర సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె అక్క శరణ్య దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయింది. అక్క ఆకస్మిక మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అయినప్పటికీ తన విద్యను ఆపకూడదనే సంకల్పంతో, కన్నీళ్లు ఆపుకుంటూ చంద్ర హాసిని పరీక్షా కేంద్రానికి వెళ్లి ఇంటర్ ఫస్ట్ ఇయర్ కెమిస్ట్రీ పరీక్షను రాసింది. తీవ్ర మనోవేదన మధ్య కూడా ధైర్యంగా పరీక్ష రాసిన హాసిని పరిస్థితి అక్కడున్న వారందరినీ కదిలించింది. ఆమె పట్టుదల, ధైర్యాన్ని పలువురు అభినందించారు. అక్కను కోల్పోయిన దుఃఖంలోనూ భవిష్యత్తు కోసం పరీక్ష రాసిన ఈ విద్యార్థిని ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# చెత్త రహిత డివిజన్ లక్ష్యం..

## ● 30వ వార్డు కౌన్సిలర్ దండి శ్రీజ



ఖమ్మం రూరల్,మార్చి 12 (జనంసాక్షి) ఏదులాపురం మున్సిపాలిటీలోనే 30వ వార్డును చెత్త రహిత డివిజన్ గా నిలబెట్టడమే లక్ష్యమని కౌన్సిలర్ దండి శ్రీజ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా డివిజన్లో చేపట్టిన పారిశుద్ధ్య పనులను వేకువ జామునే పరిశీలించారు. అలాగే వార్డులోని ప్రజలతో మాట్లాడుతూ చేపట్టాల్సిన పనుల గురించి తెలుసుకొని దగ్గరుండి వర్కర్స్ తో చేపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పారిశుద్ధ్యంలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం స్థానిక సంస్థల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. డివిజన్‌లో ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. రోడ్లు, కాల్వలు శుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పర్యవేక్షణను మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. ప్రజలు కూడా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో సహకరించాలని కోరారు. ప్రతి వీధిలో క్రమం తప్పకుండా చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకుంటామని, కాల్వలు, డ్రైనేజీలు తరచూ శుభ్రం చేసేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నామని తెలిపారు. డివిజన్‌ను పరిశుభ్రంగా ఉంచి ఆదర్శంగా నిలిపేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, కిరణ్ స్థానిక కాలనీల సభ్యులు , పారిశుద్ధ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## రాజకీయరంగు పూసుకున్న..


# కస్తూరిబా ఆకలి కేకలు

**మర్రిగూడ,మార్చ్ 12 (జనసాక్షి)**
పేద విద్యార్థినుల ఆకలి తీర్చాల్సిన విద్యాలయాల్లో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. మర్రిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో, నాణ్యత లేని ఆహారం పెడుతున్నారన్న వార్త ఇప్పుడు స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. విద్యార్థుల ఆరోగ్యం కంటే తమ స్వార్థమే ముఖ్యమనుకుంటున్న కొందరు నేతల, అధికారుల తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

పాఠశాలలో జరుగుతున్న అక్రమాలను, విద్యార్థినులకు అందుతున్న నాణ్యత లేని భోజనంపై సంబంధిత విలేకరి వార్తను సేకరించారు. ప్రజా సమస్యలపై స్పందించే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి, ఈ విషయాన్ని వాట్సాప్ ద్వారా తెలిపారు. అయితే, క్షేత్రస్థాయిలో పరిస్థితిని చక్కదిద్దాల్సిన కొందరు స్థానిక నాయకులు, సదరు స్పెషల్ ఆఫీసర్ తో కుమ్మక్కై, వాస్తవాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తప్పును వేలెత్తి చూపిన విలేకరిపై మర్రిగూడ పోలీస్ స్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదులు ఇప్పించడం చూస్తుంటే, వారి అక్రమాలను దాచుకోవడానికే ఈ కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని స్పష్టమవుతోంది.

**నిబంధనలకు పాతర.. ప్రాణాలతో చెలగాటం**
ప్రభుత్వ నిబంధనల ప్రకారం కస్తూరిబా పాఠశాలల్లో, బయటి వ్యక్తులు ఇచ్చే ఆహారాన్ని అనుమతించకూడదు. కానీ, ఈ పాఠశాలలో రాజకీయ నాయకులు, స్వాములు, ఇతరులు పంపిణీ చేసే ఆహారాన్ని విద్యార్థినులకు పెడుతూ, వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షణ చేయాల్సింది పోయి, అధికారికి వత్తాసు పలుకుతూ గొంతు నొక్కే ప్రయత్నం చేయడంపై, మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మర్రిగూడ కస్తూరిబాలో ఆకలి కేకలు... నిజం దాచే ప్రయత్నాలు!




అక్రమాలు దాచడానికి నాయకులు, అధికారుల కుమ్మక్కు!

**నీతి నిజాయితీ తప్పిన మరో ఇద్దరు విలేకరులు**
నీతినిజాయితీ తప్పిన ఇద్దరు మర్రిగూడ విలేకరులు! ఈ తతంగానికి మద్దతు పలికారు. వచ్చిన వేరే పత్రిక వార్తను వారి పరిధిలో పరిశీలించి, జరుగుతున్న అంశాలపై నిలదీయాల్సిన విలేకరులే.. వారికి మద్దతుగా నిలిచి పత్రిక గౌరవానికి మచ్చ తెచ్చారు. రాజకీయ నాయకులతో, అధికారితో కలిసి వెళ్లి పిర్యాదు ఇవ్వడం సిగ్గు చేటనే చెప్పుకోవాలి. తప్పుడు కథనం అనిపిస్తే పరువు నష్టం వేస్తూ.. న్యాయస్థాన్ని ఆశ్రయించాలి తప్ప.. పోలీస్ స్టేషన్ లలో పిర్యాదులు ఇవ్వవద్దని కనీస జ్ఞానం లేదు అని మండల ప్రజలు మొట్టి కాయలు వేస్తున్నారు. బయటి ఆహారం పాఠశాలలకు రావడం నిషేధం అని, కనీస అవగాహన లేని వ్యక్తులు.. పిల్లల పక్షాన నిలబడకుండా ఇలా లాలూచి పడటంపై, అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. ఇంతకు ముందే కస్తూరిబా, మోడల్ స్కూల్ లో జరిగిన ఫుడ్ పాయిసన్ ను, బహుశా కాంగ్రెస్ లీడర్లు, అరమోటు విలేకరులు మరిచినట్లున్నారు.

**ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి గారు స్పందించాలి..**
నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేసే, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, ఈ వ్యవహారంలో తప్పు తోవ పట్టిస్తున్న నాయకుల తీరు వల్ల, చెడ్డ పేరు వచ్చేలా ఉంది. తమ స్వార్థం కోసం పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తూ, విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న సదరు నాయకులకు, బుద్ధి చెప్పాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలలో నాణ్యమైన ఆహారం అందేలా, ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని, అక్రమాలకు పాల్పడుతున్న అధికారిపై, వారికి సహకరిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని,చిన్నారుల ఆకలి కేకలు వినబడని ఈ వ్యవస్థలో, ఎమ్మెల్యే కోమటిరెడ్డి జోక్యం చేసుకుని, న్యాయం చేస్తారని మర్రిగూడ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.. పదవ తరగతి పరీక్షల నేపథ్యంలో చిన్నారులకు, పౌష్టిక ఆహారం అందించడంలో కృషి చెయ్యాలని ప్రజలు కోరుతున్నారు.

## మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై ఉద్యమాలకు సిద్ధం కావాలి

### ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ పిలుపు

భువనగిరి రూరల్, మార్చి12 (జనంసాక్షి)
మహిళల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ మహిళలకు అండగా ఉంటూ ముందుండి పోరాడుతుంది అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) అని, మహిళల సమస్యల పరిష్కారానికి మహిళలందరూ ఐక్యంగా ఉద్యమాలకు సిద్ధం కావాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ పిలుపునిచ్చారు.

భువనగిరి మండల పరిధిలోని ముత్తిరెడ్డి గ్రామంలో ఐద్వా గ్రామ మహాసభ కొండ హైమావతి అధ్యక్షతన జరగగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనురాధ పాల్గొని మాట్లాడుతూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 1981 సంవత్సరంలో మహిళా సాధికారత, సామాజిక సమానత్వం కోసం, హింసకు వ్యతిరేకంగా ఏర్పడి మహిళల హక్కుల పైన పోరాడి అనేక విజయాలు సాధించిందని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం కోసం, విద్య కూడా మహిళలకు అందించాలని, బాల్య వివాహాలు నిషేధించాలని, పురుషులతో పాటు స్త్రీలకు ఆస్తి హక్కు ఉండాలని, వరకట్నం వేధింపుల నిరోధక చట్టం ఉండాలని, గృహహింస నిరోధక చట్టం ఉండాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం ఉండాలని, మహిళా కమిషన్లు ఏర్పాటు చేయాలని పోరాడి ఐద్వా విజయం సాధించింది అన్నారు. మహిళల సమస్యలే సంఘం సమస్యలుగా భావించి వారి తరపున



నిరంతరం పోరాడుతున్నది ఐద్వా సంఘమని తెలిపారు. బిజెపి పాలనలో రోజురోజుకు మహిళల మీద దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు కొనసాగుతున్నాయని వీటికి వ్యతిరేకంగా మహిళలందరూ పోరాటాలకు, ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఐద్వా మండల కార్యదర్శి కొండమడుగు నాగమణి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వము రోజురోజుకు ప్రజల పైన భారాలు మోపుతూ నిత్యవసర వస్తువుల ధరలను పెంచుతూ పోవడం వల్ల పేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ మధ్యకాలంలో గ్యాస్ ధర పెద్ద ఎత్తున పెంచడం చాలా దారుణమని అన్నారు. ధరలు పెరగడం వల్ల ప్రధానంగా మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా పెంచిన గ్యాస్ ధర, నిత్యవసర వస్తువుల ధరను తగ్గించాలని వారు డిమాండ్ చేసినారు. అనంతరం 16 మందితో నూతన ఐద్వా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా ఎడ్ల జ్యోతి, కార్యదర్శిగా కొండ హైమావతి, కోశాధికారిగా కొండమడుగు కావ్య, ఉపాధ్యక్షురాలుగా కొండమడుగు లక్ష్మి, పిన్నింటి హేమలత, సహాయ కార్యదర్శులుగా మెరుగు మహేశ్వరి, బొల్లెపల్లి భాను కమిటీ సభ్యులుగా ఎడ్ల రామలీల, కొండ సుజాత, ఆకారం తులసమ్మ, కొండమడుగు మమత, కొండ మంగమ్మ, బొజ్జ లక్ష్మి, బబ్బురి ఉపేంద్ర, మెరుగు సుశీల, బొజ్జ అలివేలు ఎన్నికైనారు.




## ఈనెల 14,15తేదీలలో సిఐటియు జిల్లా మహాసభలు..

**కనగల్లు, మార్చి 12 (జనంసాక్షి)**
ఈనెల 14,15 తేదీలలో సిఐటి యు 13 వ జిల్లా మహాసభలు జరుగుతున్నందున కార్మిక సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి దండంపెల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. గురువారం సిఐటియు భవనంలో కార్మికులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు కార్మికుల పక్షాన హక్కులకై పోరాడుతుందని, కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి కార్మికుల హక్కులకు భంగం కలిగించిందని గుర్తు చేశారు. ప్రభుత్వ రంగాలను ప్రైవేటుపరం చేస్తూ కార్పొరేట్ శక్తులైన ఆదా నీ, అంబానీ చేతిలో పెట్టిందని పేర్కొన్నారు. జిల్లాలోని 31 మండలాల నుంచి సుమారుగా 500 మంది కార్మిక నాయకులు పాటు రాష్ట్ర ,దేశస్థాయి, ప్రతినిధులు పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కానుగు లింగస్వామి, ఎన్ లింగయ్య సిఐటియు సంఘ బాధ్యులు పిన్నప్ రెడ్డి శేఖర్ రెడ్డి,, నరసింహ, బిక్షం, విజయ్, శంకర్, మల్లికార్జున్, నాగయ్య, వెంకటేశం, రామలింగయ్య, తదితరులు ఉన్నారు.

## బస్వాపురం నిర్వాసితుల పక్షాన సీపీఎం పోరు

**బస్వాపురం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు, ఇండ్లు కోల్పోయిన ప్రజలకు వెంటనే పూర్తిస్థాయి నష్టపరిహారం చెల్లించాలి**

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ డిమాండ్**



**భువనగిరి రూరల్, మార్చి12 (జనంసాక్షి)**
బస్వాపురం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు, ఇండ్లు కోల్పోతున్న ప్రజలకు పూర్తిస్థాయి నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. భువనగిరి మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో సిపిఎం శాఖ సమావేశం నరాల చంద్రయ్య అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నర్సింహ పాల్గొని మాట్లాడు తమ భూములను, వందలాది సంవత్సరాలుగా ఒక గ్రామంలో గూడును ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న ప్రజలు ఇతరుల అవసరాల కోసం, సాగునీరు కోసం సర్వం కోల్పోతూ ప్రాజెక్టు నిర్మాణానికి సర్వము అర్పించిన నేటికీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు అన్నంపట్ల కృష్ణ, మండల కమిటీ సభ్యులు మధ్యపురం బాల్ నరసింహ, శాఖ కార్యదర్శి మచ్చ భాస్కర్, సహాయ కార్యదర్శి రాసాల దేవేందర్, సభ్యులు ఉడుత విష్ణు, ఎండి. బాబు, ఉడత వెంకటేష్, ముదిగొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన డాక్టర్ కోడి శ్రీనివాసులు**
**చండూరు, మార్చి 12 (జనంసాక్షి)**
చండూరు మున్సిపాలిటీ పరిధిలోని నిరుపేద కుటుంబానికి చెందిన ఏలే వజ్రమ్మ (70) మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గత రెండు సంవత్సరాలుగా గాంధీజీ ఫౌండేషన్ ద్వారా నిత్యావసర సరుకులు పొందుతున్న వజ్రమ్మ బుధవారం రాత్రి అకాల మరణం చెందారు. వజ్రమ్మ మరణవార్త విన్న గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు గురువారం రోజు ఉదయం వారి నివాసానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సంతాపం ప్రకటించారు. నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల తక్షణ ఖర్చుల నిమిత్తం డాక్టర్ కోడి శ్రీనివాసులు 10,000/-రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అలాగే, 10వ వార్డు కౌన్సిలర్ కటకం రమేష్ మానవత్వంతో స్పందించి మరో 5,000/-రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, 7వ వార్డు కౌన్సిలర్ కోడి సుష్మా వెంకన్న, కాంగ్రెస్ జిల్లా నాయకులు కల్లెట్ల మారయ్య, ఏలే సుధాకర్, సరికొండ వెంకన్న, ఏలే శ్రీను తదితరులు పాల్గొని మృతురాలి కుటుంబానికి ధైర్యం చెప్పారు.